క్లుప్తంగా

ఘనంగా కొత్తమహాలక్ష్మి అమ్మవారి పండగ

మునగపాక : మండలంలోని రాజుపేటలో గురువారం కొత్తమహలక్ష్మి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది.ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

దేవాలయాల్లో సామూహిక హారతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పలు దేవాలయాల్లో సామూహిక హారతి నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు మాట్లాడుతూ సామూహిక హారతి నిర్వహించడం వల్ల దుష్ట శక్తుల నుంచి విముక్తి కలిగి శుభాలు కలుగుతాయని అన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్ విజయవంతం చేయాలి

మునగపాక: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. గురువారం వాడ్రాపల్లిలో సచివాలయ కన్వీనర్లు,వలంటీర్లు,గృహ సారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 7నుంచి 20వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సేవలను వివరించాలన్నారు. గత ప్రభుత్వానికి, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించి వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన పెంచాలన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు పెతకంశెట్టి రామజోగినాయుడు, శీరా రమణమ్మ పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 9న అనకాపల్లిలో నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో ప్రచారం నిర్వహించారు. వినాయకుని గుడి వద్ద జరిగిన కార్యక్రమంలో శోభాయాత్రను సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి రమణ వివరించారు.

వలంటీర్ సేవానిరతి



మునగపాక : స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన యెలకా రామారావు అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడికి వలంటీర్ ఉమాకృష్ణ పింఛన్ అందజేసి మానవత్వం చాటుకున్నారు.

పేదవాడి చెంతకే వైద్యం

- ఫ్యామిలీ డాక్టర్ విధానం విప్లవాత్మకం
- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



రామచంద్రపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభోత్సవంలో వైద్యులు, ప్రజా ప్రతినిధులు



నక్కపల్లిలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : పేదవాడికి మరింత చేరువగా వైద్యం అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొత్తరేవుపోలవరం గ్రామంలో గురువారం తొలుతగా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు ప్రారంభించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రారంభించిన కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభించారు. సీఎం విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామాల్లో ఒకటి రెండుమార్లు పీహెచ్‌సీ వైద్యులు అందుబాటులో ఉంటారని అన్నారు. సాధారణ వ్యాధులు, దీర్ఘకాలిక, ప్రాణాంతకర వ్యాధులకు సహితం వైద్య సేవలు అందించే అన్ని ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. గతంలో రోగం వస్తే ఎక్కడికి వెళాల్లో తెలియక చాలా మంది ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు ప్రభుత్వ వైద్యుల దృష్టికి గ్రామస్థాయి రోగులు తీసుకువెళితే అవసరమయిన వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పేదవాడికి అనునిత్యం అందుబాటులో ఉండే కార్యక్రమాలు చేపట్టే సీఎం మనకు దొరకడం అదృష్టమని అన్నారు. అనంతరం పలువురు రోగులకు ఎమ్మెల్యే మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్, నక్కపల్లి సీహెచ్‌సీ వైద్యులు కిషోర్, పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి, జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు, సర్పంచ్ మల్లే లోవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చోడిపల్లి గోవిందు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మామిడి చంటి, చోడిపల్లి అప్పన్న, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నక్కపల్లి : ప్రతి పేదవాడి ఇంటి చెంతకే వైద్యుడ్ని పంపించి మెరుగైన వైద్యం అందిచేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ, నక్కపల్లి ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ అన్నారు. గురువారం వారు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టిన ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, సురేష్ వర్మ, సాదిరెడ్డి శ్రీను, సురేష్‌రాజు, వెదుళ్ల రమణ, నేతల రత్నకుమారి, పాడగట్ల వెంకటేష్, కోమర్తి చిట్టిబాబు, శంకర్రావు, ఎంపీటీసీలు గంటా తిరుపతిరావు, గొర్ల గోవిందు, నిట్ల గోవిందు, కొల్నాటి బుజ్జి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, పార్టీ సీనియర్ నాయకులు వెదుళ్ల పాపారావు, కోమర్తి బాబూరావు, అల్లాడ కొండ, ఎల్లేటి సత్తిబాబు, రోళ్ల శ్రీను పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్

ఇకపై ఇంటి వద్దకే వైద్యసేవలు

కోటవురట్ల: నిరుపేద కుటుంబం కూడా ఇంటి వద్దనే వైద్య సేవలు పొందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు అన్నారు. రామచంద్రపాలెంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఎంపీటీసీ పెట్ల రాంబాబు, సర్పంచ్ తమరాన పరదేశమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించి వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి పేదవాడు కూడా ఇంటి వద్దనే చికిత్స పొందవచ్చన్నారు. గతంలో పెద్ద కుటుంబాలకు మాత్రమే ఫ్యామిలీ డాక్టర్ ఉండేవారని ఇపుడు సీఎం పేదలకు కూడా ఫ్యామిలీ డాక్టరును ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్, ప్రత్యూష వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తమరాన కన్నబాబు, ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, సచివాలయం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

యలమంచిలి : పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో తోడ్పడుతోందని యమ్‌పిపి బోదెపు గోవింద్ అన్నారు. గురువారం మండలంలో ఏటికొప్పాక గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య సేవల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేద ప్రజలు చిన్నచిన్న ఆనారోగ్య సమస్యలకు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ వెళ్లి వైద్యం అందించే విధానాన్ని దేశంలో ఒక్క ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని అన్నారు. దీని వల్ల పేదవాడికి మెరుగైన వైద్య సేవలందనున్నాయని, మంచి ఔషధాలు పంపిణీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకుడు సేనాపతి రాము, సర్పంచ్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు అన్నారు. గురువారం పంచదార్లలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దిమిలి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ, ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు .

చినతీనార్లలో గ్రామసభ

నక్కపల్లి: మండలంలో చినతీనార్లలో గురువారం ఎంపీడీవో సీతారామరాజు గ్రామసభ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులతో సమావేశం జరిగింది. శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించేందుకు తీర్మానం చేశారు. అనంతరం సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. వచ్చిన అర్జీలు, పరిష్కరించిన సంఖ్య గురించి తెలుసుకున్నారు. ఈసర్వీసెస్, ఇంటి పన్ను లవసూళ్లపై ఆరా తీశారు. ఈ నిధులు వెంటనే ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. అనంతరం పెద తీనార్ల సచివాలయం సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, ఎంఈవో ప్రసాద్, సర్పంచ్‌లు ముసలయ్య, మైలపల్లి శ్రీను, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌పై అవగాహన సదస్సు



మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మడుతూరులో వలంటీర్లకు, గృహ సారధులకు గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 7 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

కార్యకర్తలకు అండగా జగనన్నకు తోడుగా నిలవాలి

నక్కపల్లి : ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కార్యకర్తలకు అండగా నిలుస్తూ జగనన్నకు తోడుగా నిలవాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పిలుపు నిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయం వద్ద మండలానికి చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఇతర ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. బుధవారం జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నంపై దాడిచేయడం బాధాకరమన్నారు. ఎంపీపీకి అండగా నిలిచిన అభిమానులందరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోతాయన్నారు. జగనన్నకు పేరు తీసుకు వచ్చే పథకాలన్నింటిని చంద్రబాబు రద్దు చేస్తారన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, సీనియర్ నాయకులు మణిరాజు మాట్లాడుతూ జగనన్న అప్పగించిన బాధ్యతలు తు.చ తప్పక నెరవేరుస్తామన్నారు.

సమస్యాత్మక ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్న పట్టణ ఎస్ఐ పాపినాయుడు

యలమంచిలి : పట్టణంలో నేరాలు చోరీలను అరికట్టేందుకు పట్టణంలో సమస్యాత్మక ప్రదేశాల్లో నిఘా నేత్రాలు ఏర్పాటు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు అన్నారు. గురువారం యలమంచిలి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో స్థానిక దుకాణ సముదాయం యజమానుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన సంచారం అధికంగా ఉండి ఆర్థిక లావాదేవీలు జరిగే కార్యాలయాలు, దుకాణ సముదాయాలు, బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలను అమర్చడం వల్ల నేరస్తులను గుర్తించడం వీలవుతుందని తెలిపారు. దుకాణ నిర్వాహకులు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, చోరీ సంఘటనల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండడం మంచిదని అన్నారు. ప్రతి ఒక్కరూ దుకాణాల వద్ద అనుమానితులపై నిఘా పెట్టాలని సూచించారు. పట్టణంలో నేరాల అదుపునకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి కలిగేలా కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం వివరాలు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో ప్రజలకు వివరించాలని, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గోకులపాడు గ్రామంలో పాయకరావుపేట నియోజకవర్గ నాలుగు మండలాల నాయకులతో ఎమ్మెల్యే గురువారం సమావేశం అయ్యారు. సీఎం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న తీరు లబ్ధిదారు నుంచి తెలుసుకోవాలన్నారు. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా పథకం రాకపోతే వివరాలు వెంటనే నమోదు చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు చింతలపూడి వెంకటరామయ్య, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయమండలి అధ్యక్షుడు చిక్కాల రామారావు, అనకాపల్లి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైలా రమేష్, పాయకరావుపేట మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, ఎస్.రాయవరం, పెనుగొల్ల పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లాడ నాగరాజు, దోసపాత్రుని హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరావు, నూకనాయుడు, శ్రీపతిరాజు, నరసింహమూర్తి, సర్పంచ్‌లు లోవరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్.. ఒక బృహత్తర కార్యక్రమం

యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు



కొండకర్లలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఒక బృహత్తర కార్యక్రమం అని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం ప్రారంభించిన నేపథ్యంలో ఎమ్మెల్యే యలమంచిలి నియోజకవర్గం పరిధిలోని ఈ కార్యక్రమాన్ని అచ్యుతాపురం మండలంలోని కొండకర్లలో ప్రారంభించారు. వైద్యులు నేరుగా ఇంటికే వచ్చి వైద్య సేవలందించడం, అన్ని వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు పంపిణీ చేయడం మంచి కార్యక్రమం అని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీపీ పరీక్షలు చేయించుకున్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు లచ్చన్నాయుడు, శివ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గడపగడపలో ఆనందం

రాంబిల్లి : జననేత జగనన్న పాలనలో గడపగడపలో ఆనందం నెలకొని ఉందని ఎమ్మెల్యే యువీ రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. పెదకలవలాపల్లి సచివాలయం పరిధిలో గల వై.లోవ గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఆయా గ్రామంలో వున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నకు అండగా వుండాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ , ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డీఎస్ఎన్ రాజు, సర్పంచ్ నారాయణరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

మునగపాక: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాక ఎస్సీకాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ రూ.లక్షా 50వేలు నిధులు మంజూరు చేయడంతో ఆమె గురువారం భూమి పూజ చేశారు. సచివాలయ మండల కన్వీనర్ పొలిమేర గణేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కోనెంపాలెం అభయాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవం గురువారం జరిగింది. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ రాజాన అప్పలకొండ, సభ్యులు పాల్గొన్నారు.

'కలియుగ భగవాన్' నిర్మాతకు సత్కారం

మునగపాక: కలియుగ భగవాన్ చిత్రం విజయవంతం కావాలని వేదపండితుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ ఆకాంక్షించారు. సమాజానికి మంచి చేకూర్చే సందేశాత్మక చిత్రాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 21న విడుదల కానున్న కలియుగ భగవాన్ చిత్ర నిర్మాత అల్లు శ్రీరాముల నాయుడు, మాటల రచయిత విల్లూరి జగ్గప్పారావుకు బుధవారం రాత్రి ఘనంగా సత్కరించారు. డాక్టర్ కోరుకొండ గోపీకృష్ణ సారథ్యంలో అల్లు ప్రొడక్షన్ బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందిన విషయం తెలిసిందే.

కళాసీల వినూత్న నిరసన



మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న కళాసీలు

రాంబిల్లి: రసూల్ డెకర్ కంపెనీ వద్ద కళాసీలు రెండో రోజూ ధర్నా కొనసాగించారు. తమకు ఉపాధి లేకుండా కంపెనీ యాజమాన్యం వ్యవహరించిందంటూ కళాసీలు మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. రాము మాట్లాడుతూ, కళాసీల ఉపాధికి గండికొట్టడం దారుణమన్నారు. కళాసీలకు ఇప్పటికైనా న్యాయం చేయాలన్నారు.

ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలి..

కోటవురట్ల: ప్రతీ కుటుంబానికి సొంతింటి కల నెరవేరాలని మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ అన్నారు. యండపల్లిలో హౌసింగ్ డే గురువారం నిర్వహించారు. లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తెలియజేయాలని ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. సచివాలయంలో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

బస్ కాంప్లెక్స్ పరిశీలన

యలమంచిలి : పట్టణంలో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద దుకాణాల నిర్మాణానికి గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి స్థల పరిశీలన చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాణిజ్య దుకాణాల నిర్మాణం కోసం ఖాళీ స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీలక్ష్మి డీఈ వీరయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపుగుప్తాలతో కలిసి కాంప్లెక్స్ ఆవరణలో ఎన్ని దుకాణాలకు స్థలం ఇవ్వగలం అనే అంశంపై చర్చించారు. సోమవారం ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి దుకాణాల నిర్మాణంపై నిర్ణయం తీసుకోనున్నారని మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఎంపీపీపై దాడిచేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీలు

నక్కపల్లి: దళిత మహిళ మండల ప్రథమ పౌరురాలైన నక్కపల్లి ఎంపీపీ ఏనుగుపల్లి రత్నంపై దాడిచేసిన వారిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు, గంటా తిరుపతిరావు, గొర్లగోవిందు, కొల్నాటి బుజ్జి తదితరులు డిమాండ్ చేశారు. గురువారం వారు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.